# మతములన్ని కలిసి మంచినే బోధించె

మతము మతముకు మధ్యద్వేషము
జాతిజాతికి మధ్య జగడము
దేశదేశములందు రగడలు
దేనికయ్యా! మత ప్రబోధలు
కన్నువిప్పి చూడరోరన్నా- ఈ సాయిదేవుని

ఎన్నగా ఎందైన గలడన్నా
మొన్నషిరిడీ నేడు పర్తి ఉన్నవాడని పేరెగాని
తన్ను భావనసేయు భక్తుల కన్నులందె మెలగురోరన్నా!

**విద్యార్థులారా!**

అన్ని మతములు ప్రతిపాదించిన సత్యము ఒక్కటే. అన్ని మతముల అంతిమ ధ్యేయము ఒక్కటే. మూర్ఖుడైన మానవుని మానవునిగా తీర్చిదిద్ది మాధవత్వంగా మార్చుటమే మతముయొక్క ప్రధాన కర్తవ్యము. సదాచారమును సంరక్షించటమే మతముయొక్క ప్రధాన కర్తవ్యము. మానవుని మానసిక పరివర్తన గావించునదే మతము. కేవలము మానవుని జీవితమునకు కాక ఆత్మవిశ్వాసమును అభివృద్ధిగావించుటే మతముయొక్క లక్ష్యము. అన్ని మతములకు భద్రమైన పునాది నైతిక భావమే. నైతికత్వమే క్షీణించిన మతముతోపాటు మానవత్వము కూడను క్షీణించిపోతుంది. సత్ప్రవర్తనయొక్క ప్రధానమైన మూలము నీతియే.

srisathyasaivachanamrutam

రాజ్యముగాని సమాజముగాని లేక వ్యక్తిగాని నీతిపైననే ఆధారపడి ఉంటున్నవి. నీతిని కోల్పోయిన రాజ్యము సమాజము వ్యక్తిత్వము కూడను శిథిలమైపోతుంది. సమస్త సిరిసంపదలు, భోగభాగ్యములు నైతిక విలువలపైననే ఆధారపడి ఉంటున్నవి. అట్టి నీతితత్వాన్ని మానవుడు అనుభవించటం నిమిత్తమై ఈమతములు వచ్చాయి.

శరీరము, మనస్సు, బుద్ధి మూడింటియొక్క సమన్వయమును కావించే సదాచారమే మతము. నడతయొక్క పరిపూర్ణస్థితియే నీతి. నీతికి మరొక పేరు ధర్మము. ధర్మమనగా ప్రియం అని విలువ అనికూడను అర్థం. ప్రియముతో కూడిన నైతిక భావమును అనుసరించినప్పుడే జగత్తుకు విలువైన ఘనమైన కీర్తిసంపదలు వాటిల్లుతాయి. వస్తువునకొక విలువ ఉన్నదిగాని ధర్మమును ఇట్టిది అట్టిది అని నిర్ణయించేయటము అసాధ్యం. ధర్మమునకు మరొకపేరే నీతి. నీతికి మరొకపేరే నిస్వార్థప్రేమ. ప్రేమ తత్వాన్ని పొందే నిమిత్తమై సమాజం సుక్షేమముగా నిలిచే లక్ష్యముతో ఈ మతములు స్థాపిస్తూ వచ్చారు.

దేశకాల పరిస్థితుల ప్రభావమును పురస్కరించుకొని ఆనాటి ప్రభువులు ఋషులు ఒక విధమైన ఖచ్చితమైన నిబంధనలను శాసించుకొంటూ వచ్చారు. ఇవన్నీ మానవతా విలువలను పోషించుకొనే నిమిత్తము మానవతావిలువలను నిలబెట్టుకొనే నిమిత్తము ఏర్పడినవే. వేదశాస్త్ర ప్రమాణమును పురస్కరించుకొనియే ఈవిధమైన నిబంధనలను నిర్ణయిస్తూ వచ్చారు. ఇవి ఎప్పుడు, ఎక్కడ, ఎవరిచేత ప్రారంభమైనవి అనేది ఎవ్వరుకూడను ఇంతవరకు నిర్ణయించలేకపోయారు. ఇది మానవతా దివ్యత్వమును పోషించుకునే నిమిత్తమై ఏర్పడిన దివ్యమార్గముగా వారు విశ్వసిస్తూ వచ్చారు. క్రమక్రమేణా కాలము మార్పుచేత అనేక శాఖోపశాఖలు దీనికి చేరుతూ వచ్చాయి. మహర్షుల శాసనాల వల్లను వారి సంకల్పముల చేతనే ఈ శాఖోపశాఖలు అభివృద్ధి అవుతూ వచ్చాయి.

ఈ శాఖలకు మహర్షుల పేర్లు నిర్ణయిస్తూ వచ్చారు. సమాజముయొక్క సంక్షేమం నిమిత్తమై వశిష్టశాఖ, గౌతమశాఖ, పరాశరశాఖ, విశ్వామిత్ర శాఖ. ఈ విధమైన అనేక శాఖలను వారు నిర్ణయిస్తూ వచ్చారు. భారతీయుల మతముయొక్క కాలమును నిర్ణయించిన వ్యక్తిని ఎవ్వరుకూడను ఇంతవరకు గుర్తించలేదు. ఇవి అన్ని వేదప్రమాణములను పురస్కరించుకొని

sri sathyasai vachanamrutam

నిర్ణయించినవి. మిగిలిన మతములు రెండువేలు, రెండు వేల ఐదు వందల సంవత్సరములనుంచి ప్రారంభమవుతూ వచ్చాయి. ఆ మతములకు ప్రవక్తలు నిర్ణయమై పోయారు. ఆ మతప్రవక్తలు అనేక విధములైన ఆలోచనలు చేసి అందరి సమభావమును గుర్తించి మానవత్వానికి సమన్వయము గావించుకునే మార్గాలను బోధిస్తూ వచ్చారు.

**మతములలో చెడులేదు**

ఏ మతముకూడను ఒక మతమునకు ఒక మతము విరుద్ధమైన భావములు నిర్ణయించలేదు. కాని దురదృష్టవశాత్తు వ్యక్తులలో ఉండిన భేదభావములు సంకుచిత తత్త్వములు అనేకవిధములైన భేదములను అభివృద్ధిగావించినవి. ఒక్కొక్క మతము నందు భేదాభిప్రాయములవల్ల సంఘమునందు మత ద్వేషములనే మారణహోమములు తయారౌతూ వచ్చాయి. నిజమునకు మతమునకు మతమునకు ఎట్టి భేదము కాని ఎట్టి ద్వేషముగాని ఉండుటకు అవకాశము లేదు. ప్రాచీనమైన భారతీయ మతము కేవలము వైదిక సాంప్రదాయమును పురస్కరించుకొని, దీనినే హైందవ సాంప్రదాయమని ప్రబోధిస్తూ లోకాస్సమస్తాః సుఖినోభవంతు అని సర్వుల క్షేమాన్ని దృష్టియందు ఉంచుకొని ప్రబోధిస్తూ వచ్చింది.

ఇస్లాం మతముయొక్క ఆశయము కూడను ఇదియే. ఇస్లాం అనగా పర్షియన్ భాషలో అనేక విధములైన పవిత్రమైన అర్థములున్నవి. ఇస్లాం అనగా శరణు అని శాంతి అనికూడను అర్థము. భగవంతునకు శరణాగతుడై తోటి మానవులచేత శాంతి జీవితమును గడపమనియే ఇస్లాం మతము అంతరార్థము. ఇస్లాం మతము ఖురానుయందు పవిత్రమైన సూక్తులు ప్రబోధిస్తూ వచ్చింది. ఇందులో సలాత్ అని ఒక పదము ఒకాత్ అని రెండవపదము. సలాత్ అనగా స్థిరమైన భక్తితో భగవంతుని ఆరాధన చెయ్యాలి. ఒకాత్ అనగా దీనులైన మానవులకు దానధర్మములు ఆచరించి తోటి మానవులను సంరక్షించుటకు పూనుకోమని అర్థము. అదియే భారతీయ ఇతిహాస పురాణములయందు 'పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం' అని అష్టాదశ పురాణముల సారమును వ్యాసుడు అందిస్తూ వచ్చాడు. Help ever, Hurt never. ఈ విధమైన సూక్తులను ప్రాణసమానమైన నాణెములుగా భావించుకొంటూ ఆనాటి

sri sathyasai vachanamrutam

సర్వమతముల వారు సమన్వయం చేత జీవిస్తూ వచ్చారు.

సత్యము, శాంతి, ప్రేమ, సహన సానుభూతులు మతమునకు పంచప్రాణములుగా విశ్వసిస్తూ వచ్చారు. మతవిషయములను సంప్రదించే సమయమున వాదోపవాదములకు అవకాశమివ్వకూడదు. శాంతముతో పరిష్కరించుకోవాలని కూడను ఖురాను ప్రబోధించింది. ఇదే విధముగనే అన్ని మతముల ప్రయోజనములు ప్రమాణములు, ప్రధానమైన గమ్యములు సత్యము, ధర్మమే. అయితే ఒక్కొక్క మతమువారు ఒక్కొక్క విధమైన దానిని లక్ష్యము నందుంచుకొని దాని అంతరార్థమును గుర్తించుకొనలేక ఒకరికొకరికి భేదాభిప్రాయములు పెంచుకుంటూ వచ్చారు. ఇది ఎట్లు ఉన్నదనగా ఒకరూపాయికి 192 దమ్మిడీలు అని ఒకడంటాడు. కాదుకాదు రూపాయికి 16 అణాలు అని ఇంకొకడు వాదిస్తూ వస్తాడు. ఇంకొకడు ఇది సరియైనది కాదు. రూపాయికి నాలుగు పావలాలు అంటారు. ఇంకొకరు రూపాయికి 2 అర్ధరూపాయలు అన్నాడు. 2 అర్ధరూపాయలుగాని, 4 పావలాలుగాని, 16 అణాలుగాని, 192 దమ్మిడీలుగాని అన్నీ ఒక్కటే. ఈ సమత్వాన్ని గుర్తించుకోలేక వారివారి సంకుచిత భావముల చేత భిన్నభిన్నంగా విచారిస్తూ విమర్శిస్తూ వచ్చారు.

అన్నింటికిని ఆధారమైన పునాది నీతి. నైతిక విలువ లేకపోతే మానవత్వమే నిలువదు. ఆనాడు జనాభా చాలా తక్కువగా ఉండటం చేత అక్కడికక్కడ వారే కొన్ని ఖచ్చితమైన నిబంధనలు నియమించుకొని జీవితాన్ని ప్రశాంతముగా అనుభవిస్తూ వచ్చారు. కాలము మారుకొలది జనాభా పెరుగు కొలది వారివారి భావములు కూడను వ్యాప్తిగావించుకుంటూ వచ్చారు. ఆనాడు యావత్ప్రపంచము ఐదుకోట్ల జనాభా. ఈనాడు ప్రపంచమంతా చేరి 550 కోట్లు. కాలము మార్పుచేత నీతినిజాయితీల భావములు కూడను పలచబడుతూ వచ్చాయి. దీనికి చిన్న ఉదాహరణము. మీకందరికి తెలుసు. భారతదేశములో స్వాతంత్ర్యమును సంపాదించాలని గాంధీ ఇంకా కొంతమంది వ్యక్తులందరు చేరి కాంగ్రెస్ అనే పేరుతో విదేశీయులను ధిక్కరిస్తూ వచ్చారు. ఇది 50-55 సంవత్సరముల ముందు వరకు ఉండవచ్చు. ఈలోపలనే కాంగ్రెస్ పేర్లు ఎన్ని మారిపోయినాయి. వ్యక్తియొక్క ప్రభావమును పురస్కరించుకొని దీనిపేర్లు మార్పుచెందుతూ వచ్చాయి. ఒకటి ఓల్డు కాంగ్రెస్, రెండవది ఆర్ కాంగ్రెస్, మూడవది ఎస్

sri sathyasai vahini vachanamrutam

కాం{గెస్, నాల్గవది ఐ కాం{గెస్. ఈ విధంగా వ్యక్తి వ్యక్తియొక్క బలమును పురస్కరించుకొనియే ఈ పేర్లు మార్పుచెందుతూ వచ్చాయి. ఇంకా ఇంకా ఎంతవరకు పోతాయో ఎ మొదలు జడ్ వరకు కూడా పోతాయి.

**సనాతనధర్మము చాలా గొప్పది**

కొన్నివేల సంవత్సరములకు పూర్వము ప్రారంభమైన ఈ మతములు ఇంతమాత్రం మార్పుచెందినాయంటే ఇది గొప్పతనము కాదు. భారతీయుల సదాచార సాంప్రదాయములను అనుసరించిన సనాతన ధర్మము కనుకనే ఎట్టి మార్పులు చేర్పులు లేకుండా అనాది కాలమునుంచి ప్రదీప్తంగా వికసిస్తూ వస్తుండాది. సనాతన ధర్మమనేది భారతీయులకు మాత్రమే కాదు. యావన్మానవజాతికి సంబంధించినది. సనాతన ధర్మమనే పేరును విన్నంత మాత్రముననే ఇది భారతీయుల ధర్మము అని విదేశీయులు భ్రమిస్తున్నారు. మానవత్వమునకు సంబంధించిన ఈ ధర్మము ఒక వ్యక్తిత్వమునకో ఒక దేశమునకో ఒక కాలమునకో సంబంధించినది కాదు. విశాలమైన అనంతమైన పవిత్రమైన ఈ ధర్మములను ఈనాడు అనేకమంది ఏదో ఒక అల్పభావముతో అనుభవించటానికి ప్రయత్నిస్తున్నారు. నీతి అనే చిన్న పదమును అనేక విధములుగా వ్యాఖ్యానించే నిమిత్తమై ఇలియట్ వే ఆఫ్ లైఫ్ జీవిత ప్రధాన మార్గమన్నాడు. నీతి లేకపోతే జాతియే లేదని అతని విశ్వాసము. ఇట్టి సమస్త సారములతో సమస్త భావములతో సమస్త శక్తులతో సనాతన ధర్మము కూడినటువంటిది. ఇట్టి ధర్మమును ఈనాడు సంకుచితమైన మార్గములో ప్రవేశపెట్టి ఒక వ్యక్తిత్వమును మాత్రమే గుర్తించటానికి తగిన ఆచారముల యందు దీనిని అనుభవిస్తున్నారు. ఇది ఆకారమునకు సంబంధించినది మాత్రమే కాదు. ఆచారమునకు సంబంధించినది మాత్రము కాదు. ఆత్మతత్త్వమునకు సంబంధించినది. ఆత్మవిశ్వాసమును అభివృద్ధి గావించుకునే నిమిత్తమై ఈ ధర్మము ఏర్పడినది. అన్ని దేశీయులకు అన్ని ప్రాణులకు ఆత్మ ఒక్కటే.

దీనికి ఒక చిన్న ఉదాహరణము. మనదేహము పంచకోశములతో కూడినది. మొదటి కోశము అన్నమయకోశము. రెండవది ప్రాణమయ కోశము. మూడవది మనోమయము. నాల్గవది విజ్ఞానమయము. ఐదవది ఆనందమయము. ఈ ఐదుకోశములు అన్ని దేశీయులకు

sri sathyasai vachanamrutam

అన్ని ప్రాణులకు ఉంటున్నాయి. ఈ కోశములు భారతీయులకు మాత్రమే ఉంటుండాయి ఇతర ప్రాణులకు ఇతర దేశములకు లేదని ఎవ్వరు వాదించుటకు వీలుకాదు. అన్నమయ కోశమనగా ఏమిటి? అన్నము చేత ఏర్పడినది ఈ దేహము. అన్నముతోనే జీవించేది ఈ దేహము. అన్నము చేతనే క్షీణించేది ఈ దేహము. షడ్వికారములు అన్నము చేతనే సంప్రాప్తమౌతాయి. కనుక దేహము మాత్రమే అన్నమయ కోశము అన్నారు. తరువాత ప్రాణమయకోశము. ఇది ఐదు కర్మేంద్రియములు ఐదువాయువులు ప్రాణ అపాన వ్యాన ఉదాన సమాన ఈ రెండింటియొక్క చేరికచేత ప్రాణమయ కోశంగా రూపొందుతూ వచ్చింది. ఇంక మనోమయకోశము. ఐదుకర్మేంద్రియముల చేతను ఐదు జ్ఞానేంద్రియముల చేతను సంకల్ప వికల్పములతో కూడిన మనస్సుయొక్క తత్త్వమే. ఇంక విజ్ఞాన మయకోశము. శబ్ద, స్పర్శ, రూప రస గంధములతో కూడిన బుద్ధియే విజ్ఞాన మయకోశము. ఇంక ఆనందమయకోశము. ప్రియము, మోదము, ప్రమోదము అని మూడు రకములు. మనకు ఇష్టమైన వ్యక్తినిగాని, ఇష్టమైన వస్తువునుగాని, ఇష్టమైన విషయమునుగాని మనము విన్నప్పుడు కలిగే సంతోషమే ప్రియము. అట్టి ఇష్టమైన వస్తువో, లేక విషయమునో, వ్యక్తినో మనం పొందినప్పుడు కలిగే సంతోషమే మోదము. అట్టి వ్యక్తితో, అట్టి విషయముతో, అట్టి వస్తువుతో అనుభవించే సమయములో కలిగే ఆనందమే నిజమైన ఆనందము. ఇది ప్రమోదము. నీకు ఇష్టమైన ఫలమును గురించి ఎవరైనా చెప్పినప్పుడు నీకు కొంత ఆనందం కలుగుతుంది. లేక ఇష్టమైన వ్యక్తిని గురించి వర్ణించినప్పుడు నీకు చాలా ఆనందం కలుగుతుంది. దీనికి కారణము ఆవ్యక్తిపైన, ఆ వస్తువుపైన ఉండిన నీ ప్రీతియే. కనుక దీనిని మనము ప్రియము అన్నాము. ఈ వస్తువును నీవు బజారులో వెళ్లే సమయములో దర్శించితివంటే అక్కడ మరింత ఆనందం కలుగుతుంది. చూసిన వస్తువును నీవు అందుకొని అనుభవించినావంటే మరింత ఆనందం కలుగుతుంది. భగవంతుని దివ్యశక్తులను దివ్యవిభూతులను దివ్యప్రేమను గురించి శాస్త్రములు, ఉపనిషత్తులు ఇతిహాసములు పురాణములు వర్ణించే సమయములో కలిగే సంతోషమునకే ప్రియము అన్నారు. అట్టి దివ్యత్వముతో నీవు ఏకమై అనుభవించే సమయములో కలిగే ఆనందమే నిత్యానందము అదే ప్రమోదము. భగవంతుని గురించి వినటము, విన్న విషయాన్ని ఆచరణలో పెట్టటము, ఆచరించినదాన్ని అనుభూతిలో తెప్పించుకోవటము ఇదే ప్రియము, మోదము,

ప్రమోదములు అని. కనుకనే ఈ ఆనందమనేది ఐదవ కోశము.

దీనికి కోశము అని పేరెందుకు వచ్చింది? ఒకదానిలో ఒకటి చేరి ఉండటం చేతనే కోశములు అనిపేరు వచ్చింది. కత్తిని ఒక వరలో పెట్టినాము. అప్పుడు వరకు కోశము అనిపేరు. బియ్యమునకు పొట్టు చేరి ఉంటుండాది. మూసిపెట్టి ఉంటుండాది. ఈ హస్కే ఒక కోశము. చింతవిత్తనమునకు చింతపండు కరవై ఉంటుండాది. ఆచింతపండును తీసివేసినప్పుడే చింతగుల్ల మనకు కనుపిస్తుంది. కాబట్టి చింతగుల్లకు చింతపండే ఒకవిధమైన కోశము. అదేరీతిగనే బిడ్డ తల్లి గర్భములోపల ఉంటుండాది. అందుకనే గర్భకోశము అని దానిపేరు. ఒక వస్తువును మరొకవస్తువు ఆవరించి దానియొక్క రూపనామములు తెలియకుండా కోశము అనేది కప్పివేస్తుంది. దీనికే కోశము అనిపేరు. అన్నమయములో ప్రాణమయము ఒక కోశముగా ఉంటుండాది. మనోమయకోశమును ప్రాణమయకోశము కప్పిపెట్టింది. తరువాత విజ్ఞానమయము. ఈ మనోమయ కోశములో చేరిఉంటుండాది. విజ్ఞానమయమును ఈ మనోమయము కప్పిపుచ్చింది. ఈ విజ్ఞానమయకోశములో ఆనందమయము మరుగుపడింది. ఈ ఆనందమును విజ్ఞానమయము కప్పిపుచ్చింది. ఈ ఆనందమయకోశములోనే ఆత్మ ఉంటుండాది. ఇన్ని కోశములతో కూడినది ఆత్మ కనుక ఈ కోశములు ప్రతిమానవునికి, ప్రతి దేశమువానికి కూడ ఉండటంచేత అందరికి ఇది సమన్వయమైనదే. ఇందులో భేదమునకెట్టి అవకాశమును లేదు. కనుక ఆత్మాన్వేషణ అనేది సర్వప్రాణులకును సమన్వయమైనది. సమానాధికారం కలిగినది. అయితే అట్టి అభీష్టము మాత్రము రావాలి. దీనిని పొందాలి. దీనిని చెందాలి. దీనిని అనుభవించాలి అనే అభిలాష ప్రతిమానవునిలోను పుట్టదు.

ఈ ఐదు కోశములకును ఐదు భూతములుంటున్నాయి. ఆకాశము మొదటి భూతము. రెండవది గాలి. మూడవది అగ్ని. నాల్గవది జలము. ఐదవది ప్రకృతి. భూమి ఈ పంచభూతములలో ఒక్కొక్క భూతమునుండి మానవత్వమునకు ఏయే అంగములు ఉద్భవిస్తున్నాయి అనే దాన్ని మనం గుర్తించాలి. పంచభూతములు మానవుని ఆకారంగా ఉంటుంటాయి. ఎట్లనగా ఆకాశమునుండి రాగము, ద్వేషము, భయము, లజ్జ ఇలాంటి వంతా పుడుతున్నాయి. మానవుని యందుండిన రాగము, ద్వేషము, భయము, లజ్జ ఇవన్నీ

sri sathyasaivacharamrutam

ఆకాశముయొక్క అంశములే. మనదేహములోపల గాలినుంచి వచ్చినవి ఏమిటి? నడక, కదలిక, వణుకుడు, ఉచ్ఛ్వాస నిశ్వాసములు ఇవన్నీ వాయువునుండి ఆవిర్భవించినవి. ఇంక అగ్ని నుండి వచ్చినవి ఏమిటి? ఆకలి నిద్ర దప్పి భయము ఇవన్నీ అగ్నినుండి ప్రారంభమైనవి. ఇంక జలమునుండి వచ్చినవి ఏమిటి? కఫము, మూత్రము, రక్తము ఇవన్నీ జలమునుండి ఆవిర్భవించినవి. ఇంక ప్రకృతి నుండి వచ్చినవి ఏమిటి? చర్మము, కండరములు, నరములు, ఎముకలు, గోళ్లు, వెంట్రుకలు ఇవన్నీ ప్రకృతి నుండి ఆవిర్భవించినవి. కనుకనే ప్రతి మానవునియందును ఈ ఆకాశ వాయు అగ్ని జల పృథ్వీ అంశములు సమంగానే ఉంటున్నాయి. ఇట్టి సమత్వమైన దైవదృష్టిని ఇది నాది ఇదినీది నాదెక్కువ నీదెక్కువ అని వాదించుకోటానికి ఎవరికి అధికారము ఉంటుండాది. ఈ విధంగా విచారించుకొనేవారు తెలివితక్కువవారనే చెప్పవచ్చు. సత్యాన్ని గుర్తించలేని వ్యక్తులని కూడను చెప్పవచ్చును. అంతర్భావాన్ని చక్కగా అర్థం చేసుకుంటే ఈ సత్యాన్ని తప్పక గుర్తించగలరు. దేశకాలపరిస్థితుల ప్రభావములకు మనము ఏమాత్రము కట్టుబడరాదు. ఇది సంకుచితమైన జీవితము. విశాలమైన జీవితాన్ని మనము అభివృద్ధి గావించుకోవాలి. దివ్యమైన, భవ్యమైన మార్గాన్ని మనం అనుసరించాలి.

మతభేదములు ఎక్కడ కూడను లేవు. మతి భేదములు మాత్రమే ఉంటున్నాయి.

**మతములన్ని చేరి మంచినే బోధించె**
**తెలిసి మెలగవలెను తెలివితోడ**
**మతులు మంచివైన మతమేమి చెడ్డది.**

మతులు చెడ్డవిగా ఉంటున్నాయి. కాని మతముల్లో ఏమాత్రము చెడ్డవిలేవు. అన్ని మతములు ప్రతిపాదించిన సత్యము ఒక్కటే. అన్ని మతములయొక్క గమ్యము ఒక్కటే. అన్ని గ్రంథముల సారము ఒక్కటే. అన్నింటి చేరికను ఒక్కటే. మతములయందు ఈనాడు అనేక విధములైన భేదభావములు అభివృద్ధి అవుతూ వస్తున్నాయి. ఇది సరియైనది కాదు. ప్రతిమానవుడు తన దివ్యమైన నీతి నిజాయితీలను ఆధారం చేసుకొని దానిని పోషించుకోవటానికి తగిన కృషి చెయ్యాలి. ప్రతి మానవునకు నీతి ప్రధానమైన జ్యోతి. ఈ జ్యోతియే లేకపోతే మనము అంధకారములో మునిగిపోతాము. అదే

sri sathyasai vahini amrutam

**అసతోమాసద్గమయ**
**తమ సోమాజ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతంగమయ**

ఫస్ట్‌స్పీకర్ పిల్లవాడు చెప్పాడు. 'వేదాహమేతమ్ పురుషం మహాన్తమ్ ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్' అని. మహర్షులు భగవదన్వేషణ జరిపి మేము భగవంతుని గుర్తించాము. మేము చూడగలిగాము. మేము తెలుసుకున్నాము. అని లోకానికంతా చాటుతూ వచ్చారు. వేదాహమేతం పురుషం మహాన్తమ్. ఈ పవిత్రమైన తేజోవంతమైన పురుషుని మేము చూడగలిగాము. ఆ జ్యోతిర్మయమైన పురుషుణ్ణి మేము దర్శించగలిగాము. ఎక్కడ దర్శించాము. బయట ప్రపంచమునందా? కాదుకాదు. తమ తమ హృదయములందే. ఎక్కడ? తమసః పరస్తాత్. ఆ తమస్సుకు ఆవల ఉండిన పరమపురుషుని దర్శించాము. తమస్ అనగా అజ్ఞానము.

ఇక్కడ మనము ఒక విషయాన్ని గుర్తించాలి. ప్రతి మానవుడు ఏదో ఒక సమయంలో దుఃఖిస్తుంటాడు. ఈ దుఃఖమునకు కారణమేమిటి? అని విచారిస్తే ఈ జన్మనే దుఃఖానికి కారణం. జన్మనే లేకపోతే దుఃఖమే లేదు. అయితే ఈ జన్మానికి కారణమేమిటి? కర్మానుబందీని మనుష్యలోకే కర్మల వల్లనే ఈ జన్మం మనకు ప్రాప్తించింది. ఈ కర్మకు కారణం ఏమిటి? రాగద్వేషములే కర్మకు మూలకారణము. మన ఇష్టములే లేకపోతే కర్మలు మనము ఆచరించము. అదే రాగము. కనుక రాగద్వేషములు రెండూ చేరి కర్మను సృష్టిస్తూ వచ్చాయి. ఈ రాగద్వేషములకు ఆధారమేమిటి? అదే అహంకారము. నాకంటె అందమైన వాడు ఒకడు ఉన్నాడు, నాకంటె ఎక్కువ మార్కు తెచ్చుకున్న వాడొకడున్నాడు, నాకంటె బలవంతుడు ఒకడున్నాడు అని ఈవిధమైన అహకారము ఉండటం చేతనే రాగద్వేషములు ప్రారంభమౌతున్నాయి.

**అవివేకమే అన్నిటికి కారణము**

ఈ అవివేకమునకు మూలకారణమేమిటి? అదే అజ్ఞానము. కనుక ఈ అజ్ఞానమునకు ఆ దుఃఖమునకు చక్కని చేరిక ఉంటుండాది. అందువల్లనే దేహము ప్రాప్తిస్తూ ఉండాది. అజ్ఞానం పోవాలనుకుంటే అవివేకం నిర్మూలం కావాలి. అవివేకం నిర్మూలనం కావాలంటే అహకారము

srisathyasai vachanamrutam

పోవాలి. అహంకారం పోవాలంటే రాగద్వేషములు అణగాలి. రాగద్వేషములు అణగాలంటే కర్మలు నశించాలి. కర్మలు నశించాలంటే జీవితము ఉండకుండా ఉండాలి. జీవితమే లేకపోతే దుఃఖమే ఉండదు. కనుకనే ఈ జన్మయింక నాకక్కరలేదు అని జన్మసార్థకము నిమిత్తమై సాధనలు చేస్తూ వచ్చారు. జన్మ ఎందుకు రాహిత్యం కావాలని కోరుతూ వచ్చారు. అంటే ఇదిగో ఈ కారణమే 'పునరపిజననం పునరపి మరణం' ఈ రెండుకూడను దుఃఖమునకు హేతువైపోతున్నాయి. ఈ జనన మరణములే లేకపోతే దుఃఖములకు మనము ఏమాత్రము గురికాము. అట్టి జన్మరాహిత్యమునకై చేసే ఈ ఆధ్యాత్మిక సాధనలు కేవలం ఒక సాక్షాత్కారం కోసమనిగాని ఇంకేవిధమైన అనుభూతికి అతీతమైన ఆనందాన్ని అనుభవించటానికికాని కాదు. మనమే చక్కెరగా తయారైపోవటం. ఇప్పుడు షుగర్ తినేవారుగా ఉన్నాము. మనమే షుగర్‌గా మారిపోతే షుగర్‌పైన ఆశనే మనకుండదు.

'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' తాను బ్రహ్మగా మారిపోవటమే. అట్టి మార్పు కలిగించేదే మతము. మూర్ఖుడుగా ఉండిన వీనిని మానవునిగా మార్చి మానవునినుండి మాధవత్వానికి తీసుకొనిపోయేది మతము. ఇంత పవిత్రమైన దివ్యమైన మతములను ఈనాడు మనము చిల్లర విషయాలలో ఉపయోగపెడుతున్నాము. రెలిజియన్ Realisation is religion. మనము మన తత్త్వాన్ని గుర్తించుకోవటమే Religion. మనకు మనము realise చెయ్యాలి. మనం ఎవరు? మనం ఎవరు? మనం ఎవరు? ఇదే వేదాంత ప్రబోధ. వేదాంతమనగా ఏమిటి? నేను నేను నేను అనేదాని అంతమే వేదాంతము. ఈ నేను యొక్క అంతమే వేదాంతము. వేదమే ద్వైతము. ఈ అన్నింటియందుకూడను అనేకరకములైన ప్రబోధలు జరుపుతూ వచ్చింది లోకములో. మధ్యకాలములో ఈ మతములను తిరిగి సంరక్షించదలచి శంకరులవారు ఆవిర్భవించారు. సర్వమతములయందు ఉండే సమన్వయత్వాన్ని ప్రబోధించటానికి పూనుకున్నాడు. ఇదే అద్వైతమతము అన్నారు. అద్వైత మనగా అనేకత్వములో ఉన్న ఏకత్వమే. ఇలాంటి ఏకత్వమనే ప్రబోధిస్తూ వచ్చాడు. ఆ అద్వైతము శాశ్వతంగా ఈ జగత్తునందు నిల్చకుండా పోవటానికి కారణమేమిటి? బోధించటం అద్వైతం ఆచరించటం ద్వైతం కావటంవల్ల ఈ అద్వైతమతమునకు అంత పటుత్వము లేకపోయింది.

అంతా ఒక్కటే అనుకున్నప్పుడు బ్రహ్మసత్యం జగన్మిథ్య అని జగత్తునెందుకు మిథ్య అనాలి? తరువాత సర్వం విష్ణుమయం జగత్ అని మరొకటి పుట్టించటానికి కారణమేమిటి? ఈవిధమైన ద్వైత మార్గమునందు అద్వైతాన్ని బోధించటం చేతనే అద్వైతానికి తగిన బలము లేకపోతూ వచ్చింది. ఒకడు మాస్టర్ అని ఇంకొకడు సర్వెంట్ అని ఈ విధమైన భేదభావములుండకూడదు. లేత వయస్సునందే జగత్తంతా సంచరించి అందరితో వాదించి విజయాన్ని సాధించాడు శంకరుడు. ఇతరులతో వాదించి విజయాన్ని సాధించాలనుకొంటే అక్కడొక desire ఉండాలి కదా. ఈ desire అనేది ఆశ అనేది, కోరిక అనేది ద్వైతమునకు సంబంధించినదే. అద్వైతమునకు కాదు. ఈ రకమైన దీనిచేతనే వాదోపవాదములు బయలుదేరి మరొకరు ఇంకొకరు ఆవిర్భవిస్తూ వచ్చారు.

**విశిష్టాద్వైతము**

రామానుజులవారు విశిష్టాద్వైతము అన్నారు. విశిష్టాద్వైతమంటే ఏమిటి? వ్యక్తులు విషయములు వస్తువులు విడివిడిగా ఉండినప్పటికిని ఈ అన్నింటియందు ఒక దివ్యత్వమనే అంశము ఉంటుండాది. ఈ దివ్యత్వాన్ని అంశంగా భావిస్తూ వచ్చాడు రామానుజులవారు. అంశము అనేది ఒకటి ఉంటున్నప్పుడు విరుద్ధంగా దానికింకోటి ఉంటున్నది కదా. బింబము అనేది ఉండినప్పుడు ప్రతి బింబము వస్తుంది. Sound అనేది ఉండినప్పుడే రీసౌండ్ అనేది వస్తుంది. రియాలిటీ ఉండినప్పుడే ప్రతిబింబము అనేది ఒకటి వస్తుంది. కాబట్టి ఇక్కడ Reflection, Reaction, Resound అనేవి ఉన్నాయి. అనే దాన్ని చక్కగా అర్థమయ్యేటట్లుగా బోధించారు. జీవుడు సాధనచేత దేవునిలో ఐక్యము కావచ్చును, చేరవచ్చును అనేది అతని సిద్ధాంతము.

ఇది సరియైనదికాదు. జీవుడు జీవుడే. దేవుడు దేవుడే. ఆ ఆనందాన్ని అనుభవిస్తూ ఉండవచ్చును. కాని జీవుడు దేవుడు కాదు. దీనికి చక్కని ఆదర్శం ఒక్కటే. మనము పాలను తీసుకుందాము. పాలను కాచి తోడు వేసినప్పుడు ఇది పెరుగుగా మారిపోతుంది. ఈ పెరుగును మథనము చేసినప్పుడు అందులో వెన్న బయలుదేరుతుంది. ఈ వెన్ననుకాచిన తరువాత అది నెయ్యిగా రూపొందుతుంది. అయితే ఈ నెయ్యి ఎక్కడనుండి వచ్చింది? ఈ నెయ్యికి ఆధారము

sri sathyasaivachanamrutam

వెన్న. ఈ వెన్నకు ఆధారముపాలే. పాలలో ప్రతిబిందువునందు ప్రతి అణువునందును వెన్న ఉంటుండాది. ఉండినప్పటికి మనకు గోచరించదు. దానిని చేయవలసినది మనము ఆచరించినప్పుడే ఆ వెన్న వేరుగా వస్తుంది. కనుకనే పాలు అనేది అద్వైతము ఈ పాలనుంచి వచ్చిన సారమే వెన్న. వెన్నను తీసివేసినప్పుడు మజ్జిగ వేరుగా అయిపోతుంది. పూర్తి వెన్నలోపల మజ్జిగలేదు. మజ్జిగ లోపల వెన్నలేదు. ఇక్కడ మజ్జిగ వెన్న రెండుగా ఉంటున్నాయి. అయితే వెన్న విశిష్టమైనది. పాలసారమంతా వెన్నలో ఉంటుండాది. మనం పాలను గూర్చి యోచించినక్కరలేదు. వెన్ననే అతిప్రధానము. అని రామానుజులవారు విశిష్టమైన అద్వైతంగా నిరూపిస్తూ వచ్చాడు.

తరువాత మధ్వాచార్యులు. అతను కృష్ణ భక్తుడు. ఎప్పుడు చూచినా కృష్ణుడు వేరుగాను నేను వేరుగాను ఉంటుండి అతనితో ఆనందాన్ని అనుభవించటమే ప్రధాన కర్తవ్యమన్నాడు. నేనే కృష్ణుడైపోతే ఆనందంయొక్క మాధుర్యం ఏమాత్రం నాకు అర్థము కాదు. కృష్ణుడు కృష్ణుడుగానే ఉండాలి. నేను దాసుడు గానే ఉండాలి. నేను అనుభవించేవాడు. తాను ఆనందించేవాడు. అతను నాయకుడు. నేను నాయిక. మధ్వాచార్యుడు ఈ విధమైన సన్నిహిత సంబంధబాంధవ్యము కోరుతూ వచ్చాడు. ఏది చేసినప్పటికిని కృష్ణునియొక్క సంబంధము తోనే ఆచరించటానికి ప్రయత్నించాడు. ఆ కృష్ణుడు సర్వత్రా ఉంటున్నాడు. ఉండినప్పటికిని తాను నాకు వేరుగానే ఉంటున్నాడు. అందువల్లనే పురందరదాసు కూడా చెప్పాడు.

**పురందరదాసు**

**హుట్టిసిదతాయందె ఇష్టమిత్రనునీనె**
**అష్టబంధువు సర్వ బళగనీనె**
**శ్రేష్ట మూరితిస్వామి నీ నిరువతనక**
**నాన్యాకె బడవా, నాన్యాకె పరదేశి.**

పెట్టిలో పెట్టిన అష్టాభరణములంతా నీవే. నన్ను పుట్టించిన తల్లి తండ్రి మిత్రుడు కూడనీవే. అలాంటి నీవు నాకుండినంతవరకు నాకితరులతో పనిలేదు. ఈ జగత్తే నాకక్కరలేదు.

**విద్యె హేళువ నీవె బుద్ధి కలిసున నీనె.**

sri sathyasaivachanamrutam

**ఉద్ధారకర్త మమస్వామి నీనె**
**ముద్దుశ్రీ పురందరవిఠల నిన్నడిమేలె**
**బిద్దకొండిరువ ఎనగేత రాభయవో**
**నాన్యాకే బడవా నాన్యాకే పరదేశి**

నేనెందుకు పరదేశినౌతాను. నేనెందుకు దరిద్రుడౌతాను. నేను దరిద్రుడనేకాను. నేను మహాశ్రీమంతుడను. కృష్ణా! నీవొక్కడుంటుంటే నాకీలోకంతో అక్కరలేదు. నీవు నీవుగానే ఉండాలి. నేను నేనుగానే ఉండాలి. మనఇద్దరికి కూడను సన్నిహిత సంబంధ బాంధవ్యమనేది ప్రేమ. అదే కరెంటు బల్బుకు వైరు ఉంటే ఏవిధంగా ఆ బల్బు ప్రకాశిస్తూ ఉంటుందో అదేవిధంగానే నీకూ నాకూ మధ్యలో ఈ ప్రేమ అనే వైరుండాలి. ఇదిమాత్రం ఎడబాయటానికి వీలుకాదు. ఈ సృష్టికంతా ఎవరు కారణం? నీవే కారణం. నీకంటె వేరు మరొకడు లేదు. చిత్రకారుడవు నీవే. కవిత్వము నీవే.

**చిత్రంబులు త్రైలోక్య ప**
**విత్రంబులు భవలతాలవిత్రంబులు స**
**న్మిత్రంబులు మునిజనవన**
**చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.**

అన్నాడు. భగవంతుని చిత్రములు ఎంత విచిత్రములు. మన భారతదేశమందే ఇప్పుడు 80 కోట్లమంది ప్రజలుంటున్నారు. ఈ 80 కోట్లమంది జనంలోపల ఒకడు ఉండినట్లు ఇంకొకడు ఉన్నాడా? లేదు. ఎంతో వ్యత్యాసము ఉంటున్నాది. ఇన్ని విధములైన భేదములు సృష్టించినదెవరు? ఏ సైంటిస్టయినా సృష్టించగలడా? ట్విన్సు ఇద్దరుగా వచ్చినప్పటికిని వాళ్లలో వాళ్ళకు కొంచెం పండ్లైనా భేదముంటాది. కండ్లైనా భేదముంటాది. ఇన్ని విధములైన భేదములుగా సృష్టించిన చిత్రకారుడు భగవంతుడు తప్ప వేరొకడు లేదు.

**బెట్టదా తుదియల్లి హుట్టిద వృక్షక్కె**
**కట్టెయను కట్టి నీరకెదవరు యారు**

కొండలో రాతిపైన పుట్టిన వృక్షమునకు అక్కడెవరైనా పాదుచేసి నీరుకట్టి ఎవరు వేసి పెంచారా?



sri sathyasai vachanamrutam

ఎవ్వరూ పెంచలేదు. నీవే ఆ రాతిపైన పుట్టిన వృక్షాన్ని కూడను అభివృద్ధిగావించి ఉంటావు.

**నవలిగె ఫింఛవను బరదెవరు యారు**
**పవళద లతెగె కంపిట్టెవరు యారు?**

పచ్చని చిలుకకు ఎఱ్ఱని మూతి పెట్టినది ఎవరు? దానికి ఎంతబాగా match అయిపోయింది? నెమిలి ఉంటుండాది. ఈ నెమలియొక్క రంగులు ఎంత షైనింగ్‌గా అందంగా ఉంటున్నాయి? ఈ రంగులు ఎవరు వేశారు? నీ సృష్టియే. ఈనాడు ఏదైనా ఒకదానికి పెయింట్ వేస్తే artificialగా కనుపిస్తుందప్పుడే. భగవంతుని సృష్టి అంతయుకూడను సహజము. సహజము. ఇది మరొకరి చేత సాధ్యంకాదు.

**కల్లినలి హుట్టితా మాగువప్రాణిగె**
**అల్లి ఆహారవను నిర్మిసిత్తవర్యాదు?**

రాతిలో పుట్టిన కప్పకు అక్కడనే ఆహారమంతా ఎవరు పోయి అందిస్తున్నారు? నీవు కాదా? ఈ మధ్వాచార్యులు చక్కగా భగవంతుని వర్ణించుకుంటూ అతను అతడే. నేను నేనే. అతను Master నేను Servent. అతను బింబము నేను ప్రతిబింబము. అతను Sound నేను Resound ఈ విధంగా రెండుగా ద్వైతంగా విభజిస్తూ వచ్చాడు. ఈ ద్వైతము లోనే అనంతమైన ఆనందాన్ని అద్వైతాన్ని అనుభవిస్తూ వచ్చాడు.

**హిందూమతము సర్వుల క్షేమము కోరేది**

ఈలోకములో దానిని అనేకమంది ఇష్టపడుతూ వచ్చారు. అనేకమంది దీనిని ఇష్టపడుతూ వచ్చారు. మరికొంతమంది ఇంకోదాన్ని ఇష్టపడుతూ వచ్చారు. అదే శంకరమతము, రామానుజమతము, మధ్వాచార్యమతము. కొన్నికొన్ని మతములు వ్యక్తిగతమైనవిగా అభివృద్ధిగాంచుతూ వచ్చాయి. ఇది ప్రవక్తల సృష్టి కానీ హిందూమతమనేది ఎవ్వరిచేత సృష్టించబడినది కాదు. హిందూ అనగా కేవలము భారతదేశమునకు సంబంధించినది కాదు. ఇది సర్వుల సుక్షేమము కోరేది. అందుకోసమే చెప్పారు. హిం అనగా హింస. దూ అనగా దూరము. హింసకు దూరముగా ఉండేటువంటిది హిందూదేశము అని. ఆనాటినుండి నేటివరకు

srisathyasaivahanamrutam

అన్ని దేశముల క్షేమాన్ని అన్ని ప్రాణుల అభివృద్ధిని కోరుతూ వస్తున్నది ఒక్కహిందూ మతమే. దీనినే సనాతన మతమని చెప్పుతూ వచ్చారు.

దేనికోసం సనాతన మతమన్నారంటే దీనిని సృష్టించే వ్యక్తిలేదు. ఎప్పుడు వచ్చిందనే డేటు లేదు. మిగిలిన మతములకు కొన్ని కాలములంతా నిర్ణయమై ఉంటున్నాయి. అయితే హిందూమతము కఠినమైన కట్టుబాట్లకు లొంగిపోతూ వచ్చింది. ఆ కట్టుబాట్లు ఉండటం చేతనే ఈనాటి వరకును భారతదేశంలో ఈ సనాతన ధర్మము కదిలించేవాడు గాని, అదిలించేవాడు గాని లేడు. ఇదికేవలము పెరిగేదిగాని తరిగేది కాని కాదు. అన్ని దేశములకును సంబంధించినది ఈ మతము. అందరు మానవులకును సమ సమన్వయమైనది ఈ మతము. క్రిస్టియన్స్ అనికాని, ముస్లిమ్సనికాని, బౌద్ధులని గాని, జోరాష్ట్రియనులనిగాని, సిక్కులనిగాని, పార్శీలనిగాని ఏమాత్రము భేదములు పెట్టుకోకూడదు. విద్యార్థులు మాత్రము ఇట్టి భేదమునకు ఎట్టి అవకాశమును అందించరాదు. అన్ని మతములను గౌరవించాలి. నీమతములో ఏదుందో ఎదుటి మతములో అదే ఉంటుండాది. నీ మతాన్ని నీవు అనుసరిస్తూ గౌరవిస్తూ ఉంటుంటే ఒకరినొకరు విమర్శించనక్కరలేదు కదా? ఈనాడు హిందువు హిందువని నీవు చెప్పుకొంటున్నావు. నీ మతాన్ని నీవు గౌరవించటం లేదు. ఈనాడు ముస్లిం మతమని అంటున్నారు. కాని ఆ మతాన్ని వారు గౌరవించటం లేదు. క్రిస్టియన్ మతమంటున్నారు. కాని వారు ఆ మతాన్ని గౌరవించటం లేదు. నిజంగా వ్యక్తిగతమైన విశ్వాసములు ఈనాడు మార్పులు చెందుతూ పోతున్నాయి. తోటి మానవునితో సోదరమానవునిగా నీవు ప్రవర్తించి జీవించు అన్నది ఇస్లాంమతం. కానీ వారావిధంగా నడుచుకుంటున్నారా? లేదు.

క్రిస్టియన్ మతములో ఒక చెంప కొడితే రెండవ చెంప అందించు అని అంత సహనాన్ని నిరూపించారు. కానీ ఈనాడు నిర్దాక్షిణ్యంగా బాంబ్సు పెట్టి నిరపరాధులనంతా ఒక్క నిముషములో భస్మము గావిస్తుండేది ఎవరు! క్రిస్టియన్సు కాదా? వారివారి మతములు పొగడుకొంటున్నారేగాని ఆచరించటం లేదే? ఎవరెవరి మతమును వారు గౌరవించటం చాలామంచిది. ఇతర మతములను కూడను గౌరవించటం మంచిది. ఒకవేళ గౌరవించటం నీకిష్టం లేనప్పుడు ఊరుకుండు. అంతేగాని దాన్ని విమర్శించవద్దు. ఈ విధమైన విశాలభావాన్ని పెంచుకోవటమే

sri sathyasaivachanamrutam

ఈనాటి విద్యార్థులయందు అత్యవసరము. ఈనాటి విద్యార్థులే భావిభారతోద్ధారకులు. ఎవ్వరియందు కాని ఎట్టి మతమునందుగాని ద్వేషము కాని భేదముగాని మీరు పాటించరాదు. అన్ని మతములయందు ఉండిన సారం ఒక్కటే. అని నీవు తెలుసుకో. ఇదే సనాతన ధర్మము.

మీకందరికి తెలుసు. ఒక మోసంబి తీసుకుంటారు. దాంట్లో జ్యూస్ అంతా తీస్తారు. కుళ్లిపోయినదాని రసము తీస్తారు. కాయగా ఉన్న దానిరసము తీస్తారు. బాగాపండైన దానినుండి తీస్తారు. అన్ని రసములు చేరుస్తారు. అన్ని రసములు చేర్చి రెక్స్ అని ఒక డ్రింకుగా పెట్టేస్తారు. ఒక్కొక్క పండు రసం ప్రత్యేకంగా ఉందా. అని రసములు కరుణారసములే. అందులో ఏద్వేష రసముగాని ఏ దుఃఖరసము గాని, ఏ శోకరసము గాని లేదు. విడివిడిగా తీసుకున్నప్పుడు పుల్లనిరస ముంటుండాది. తియ్యనిరసముంటుండాది. వగరు రసముంటుండాది. ఇంక కుళ్లిపోయిన రసము కూడ ఉంటున్నాది. అన్ని రసములు చేరేటప్పటికి అది కరుణారసంగా మారిపోతుంది. మార్గాల్లోపల కూడను వేరువేరుగా ఉండవచ్చు. కనుకనే మార్గాలు వేరువేరుగా ఉండినంత మాత్రమున దానిలోఉన్న మాధుర్యము ఏమాత్రము మార్పురాదు. చెరకు వంకరపోతే తీపికి వంకరుంటుందా? అది ఎప్పుడూ ఒకేరసంగా ఉంటుంది. అదేవిధముగానే నీబుద్ధులు ఈవిధంగా వంకరగా ఉండవచ్చునేగాని మతములలో ఏవిధమైన దోషములు లేవు.

**మతములన్ని వేరు మార్గంబు ఒక్కటే**
**వస్త్ర భేదము వేరు వస్తువొకటె**
**శృంగారములు వేరు బంగారమొక్కటే**
**పశులవన్నెలు వేరు పాలు ఒక్కటె**
**జీవ జంతులు వేరు జీవుండు ఒక్కడె**
**జాతినీతులు వేరు జన్మమొక్కటె.**

ఒకరు తల్లిగర్భమునుంచి రావటం, మరొకరు ఆకాశంనుంచి చటుక్కున ఉట్టి పడటం ఇవంతా ఏమిలేదు. అందరు జన్మములో సమానులే. దైవత్వాన్ని మనం పొందాలంటే ఉండేది ఒకే దివ్యత్వం. ఆ ఒక్క దివ్యత్వం అన్నింటియందు ప్రతిబింబిస్తూనే ఉంటుండాది. ఒక్కొక్క మతము ఒక్కొక్క పాత్ర వంటిది. సూర్యుడు అన్ని పాత్రలలోను ప్రతిబింబిస్తూ ఉండినట్టుగా పాత్రలకు

srisathyasaivacharamrutam

విలువలు తగ్గవచ్చు, ఎక్కవచ్చు. కాని ఆ పాత్రలలో ప్రతిబింబించే సూర్యునికి విలువ ఎక్కించటానికి తగ్గించటానికి వీలుకాదు. సమత్వంగానే ఉంటాడు. ఈనాడు సంకుచిత హృదయులు ఏరీతిగా భావిస్తున్నారంటే ఒక పాత్రలో oil ఉంటుందాది. ఆ తైలములో చంద్రుడు కనుపిస్తున్నాడు. ఆ చంద్రుడు తైలములో కనిపించకుండా చేయాలంటే ఏమి చేస్తారు. మూర్ఖుడైనవాడు ఆ పాత్రను నిప్పులో పెట్టి కాస్తూ వస్తుంటాడు. కాని వివేకవంతుడు ఏమిచేస్తాడు? ఈ ప్రతిబింబమునకు మూలకారణమేమిటి తైలము. తైలమును తీసివేస్తే దీనిప్రతి బింబము ఇక్కడ ఉండదు. పాత్రను ఎంతకాచినా ప్రయోజనం లేదు.

**దైవమే లోపల వైశ్వానరుడుగా ఉన్నాడు**

అదేరీతిగా మనదేహమొక పాత్ర. ఈ దేహపాత్రలో ప్రతిబింబించేదాన్ని మనం దూరం చేయాలనుకొని దేహాన్ని అనేక రకములైన హింసలు పెడుతున్నాం. ఏమిటి ఆ హింసలు? ఉపవాసవ్రతాలు. తిండి తినకుండా ఏదోదేవుని వ్రతములని చెప్పుకోవటం శరీరాన్ని కృంగజేసుకోటం తద్వారా బలహీనం కావటం ఈ బలహీనత వలన మనస్సుయొక్క బలం తగ్గిపోవటం. ఎందుకివన్నీ. 'అహంవైశ్వానరో భూత్వాప్రాణినాం దేహమాశ్రితః ప్రాణాపాన సమాయుక్తః' నీ హృదయములో నేను వైశ్వానరుడుగా ఉంటున్నాను. నీవు వేసేదంతా భగవంతునికి అందించినట్టుగా భావించు. ఎంత పవిత్రమై పోతావు. నేను తింటున్నాను. నేను తింటున్నాను అనే భావముతో తినవద్దు. తననుంచి వస్తుండాది. అహంవైశ్వానరో భూత్వా నేను ప్రతి భూతమునందు కూడను వైశ్వానరుడుగా ఉంటున్నాను. కనుక ఆ భావముతో ఏది చేసినప్పటికి భగవంతునికి నేను నైవేద్యంగా అందిస్తున్నాను. నాలో ఉండిన భగవంతుడే దీన్ని ఆరగిస్తున్నాడు. జీర్ణకోశాన్ని ఉదరమున చేర్చిన దెవరు? మన ఉదరములో ఈ జీర్ణకోశాన్ని ఎవరు చేర్చారు? జనన మరణాలు ఎవరిచే కలుగుచుండె? దీనిని గుర్తించటానికి ప్రయత్నించాలి. అదే మానవునియొక్క వివేకం. అట్లు కాకుండా ఏదో ఏకాదశిరోజు ఉపవాసాలు ఉండటం, మూడునాలుగు దినాలంతా ఏమీ తీసుకోకుండా పోవటం తరువాత దానికి డబుల్ డబుల్‌గా తీసుకోవటం. ఇంకా కొంతమంది ఉంటారు.

మధ్వమతములో భీష్మైకాదశి అని ఒకటివస్తుంది. భీష్మైకాదశి అంటే కఠినమైన వ్రతము.

srisathyasaivachanamrutam

భీష్ముడు కఠినవ్రతమును పూనుకున్నాడు కదా! అదేరీతిగా ఒక కఠినమైన ఉపవాస వ్రతము. ఏమిటి ఆ ఏకాదశి అంటే తనకు వచ్చిన ఉమ్మిని కూడను మింగకూడదు. అంతవ్రతము. అట్లు మూడు దినములు వ్రతము చేస్తారు. నాలుగో దినము చక్కగా భోజనము చేస్తారు. ఈ మతములోపల ఒక పద్ధతి ఉంటుండాది. మధ్వమతసిద్ధాంతమంటే దాన్ని వదలవద్దు. 'విడబేడి బిట్టు కెడబేడి' దాన్ని విడచిపెట్టి నీవు చెడిపోవద్దు. చెడిపోయి తిరిగి దాన్ని పట్టవద్దు. కనుక ఆ పద్ధతులనంతా నీవు చక్కగా అనుసరించు. అయితే ప్రతి మతములో కూడ కొన్నికొన్ని బలహీనతలుంటున్నాయి.

భీష్మైకాదశి ప్రారంభిస్తారు వాళ్లపని అంతా ఏమిటి తెలుసునా? పిండిని రుబ్బటము. దోశకు తగిన ఏర్పాట్లంతా చేసుకోవటము. ఈ మూడు దినములంతా పిండినంత చక్కగా మాగపెట్టడము. మూడు దినములైతే అది చక్కగా ఉప్పొంగుతుంది. పొంగుతుంది దోసె. దీనినే కొన్ని పదములలో చెబుతారు. ఇందు మాడిదె ఏకాదశి, బందుతిందు నలవత్తు దోశె. ఏకాదశి ఏకాదశి అని చెప్పి నలభై దోశలకు పిండి కలిపిపెట్టుకుంటారు. ఇంక ఎందుకు ఈ ఏకాదశి చెయ్యాలి? అయితే అందరుకాదు, కొందరు అట్లా ఉంటారు. ఇంక వైష్ణవులందు కూడను ఇదే పద్ధతి ఉంటుండాది. వైష్ణవ అంటే అర్థం ఏమిటి? విశ్వవ్యాపకత్వమైన దివ్యత్వాన్ని చింతించటమే వైష్ణవం. విష్ణువనగా సర్వవ్యాపకుడు. అనంతమైన అంగములతో ఒక లోకమునకు దిగివచ్చినవాడు. ఎక్కడచూసినా అతనే ఉంటుండేది. ఈ సిద్ధాంతమును నమ్మినవాడు ఈ భేదాలెందుకు. అన్ని మతములయందు కొన్నిటిని విశ్వసిస్తున్నారుగాని విచారణ ద్వారా వివేకము ద్వారా అనుభవించటానికి ప్రయత్నించటం లేదు.

విద్యార్థులారా! ముఖ్యంగా ఈ మతబేధములు మీరు పెట్టుకోకండి. అన్ని మతములందు ఉండినదైవము ఒక్కడే. అట్టి భావము చేత అన్ని మతములను గౌరవించండి. అన్ని మతముల సారమును ఒక్క మతమునందే మీరు అనుభవించండి. వాదోపవాదములకు పూనుకోకండి. మీరు ఒక మతమును మరొకమతంగా విమర్శించకండి. ఈ దూషణలనేవి చాలా ప్రమాదము. నీవు ఏదో ఒక మతమును దూషిస్తున్నావుకాని నీమతాన్నే నీవు దూషించిన వాడౌతావు. అందరికీ ఒక నమస్కారం చేయండి. సర్వజీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి. అందరికీ చేసిన

srisathyasaivachanamrutam

నమస్కారం ఆ కేశవునికి చెందుతుంది. ఆ విధమైన సమభావము చేత ప్రేమభావాన్ని పెంచుకొని విశాలత్వము చేత విశ్వాన్ని విశ్వసించి విష్ణుత్వాన్ని పొందండి. ఇదే మతముయొక్క ప్రధానమైన సారము.

**(తేది. 23-07-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam